## చిన్న కథ

# " సుగుణ "

శ్రీమతి కస్తూరి రంగనాయకమ్మగారు

సుగుణా సుదర్శనుల వివాహమై పది సం॥ లైంది. వారిద్దరిది అన్యోన్య దాంపత్యం ఆ వూరి వారందరూ వారిద్దరిని చూసి "యెంత అనుకూల దంపతులమ్మా ఎంత పుణ్యమో కదా ఆ తల్లి దండ్రులది, అత్త మామలదీను" అని అనుకునే వారు. పది సంవత్సరాల తరువాత పుట్టిన పసిపాప వీరిద్దరి అన్యోన్యాన్ని మరీ బలపఱచాడు. ఆ బాలుణ్ని చూసి అందరు కొండెక్కేరు.

సుదర్శనుడు ప్లీడరీ చేస్తున్నాడు. అతనికి అంతయెక్కువ రాబడి లేక పోయినా, సంసారంలో యే వస్తువుకు కొదువ లేదు.

సుగుణకు కాలేజీ చదువులేదు కాని విద్యావంతురాలు. ప్రతిపనిలోను అతి నిపుణత, చాకచక్యము గలది. సంసారం చక్కగా దిద్దుకునేది. భార్యా భర్తలిద్దరూ వొక్కటేమాట, వొక్కటే మనస్సుగా వుండేవారు.

సాయింత్రం సుదర్శనుడు డాబాలో కూర్చున్నాడు. సుగుణ కూడ యింటి పనులన్నీ ముగించుకుని మేడ మీదికి వచ్చింది. రోజూ యిదివారికి మామూలే. డాబాలో కూర్చుని కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ గడపే వారు. కానీ యీ రోజెందుకో సుదర్శనుడు సంతోషంగా, కులాసాగా లేడు. నిరుత్సాహానికి కారణం యేమిటని సుగుణ చాలాసార్లు అడిగింది. కానీ అతను జవాబు చెప్పలేదు. ఎన్నడూ తనభర్త యందు యిటువంటి ప్రవర్తన చూడని సుగుణ నిలువునా నీరై పోయింది. ఆమె కండ్లు అశ్రుపూరితములైనవి. ఇక నక్కడ నుండుటకు ఆమె మనస్సెంత మాత్రము వొప్పలేదు. ఆమె క్రిందికి వెళ్ళుటకు లేచినది. అప్పుడు సుదర్శనుడు ఆనందుడేడీ? అని అడిగాడు.

సుగుణ: "ఇప్పుడిప్పుడే కేశవుడితో షికారుపంపేను" అన్నది.

సుదర్శనుడు. "కేశవుడితో పిల్లవాణ్ణి పంపవద్దని నీకులక్ష సార్లు చెప్పాను కానీ నీకు నామాటంటే లక్ష్యంవుంటేనా."

సుగుణ నిర్ఘాంతపోయింది. తన భర్త తనతో చెప్పడమూ, తను చెయ్యకపోవడమునా? ఆమెకు యేమి జవాబుచెప్పాలో తెలీలేదు. మేడమీదినుంచి క్రిందికి వెళ్లి పోయింది. సుదర్శనుడు ఆమె అట్లువెళ్ళుట అహం భావ మనుకున్నాడే కాని, తాను అకారణంగా ఆమె మనస్సును నొప్పించినట్లు తెలుసుకొనలేదు

నిజానికి సుదర్శనుడు పిల్లవాణ్ణి వానితో పంపవద్దని, యెన్నడూ ఆమెతో చెప్పలేదు. చెప్పినట్లైతే సుగుణ పంపేదేనా!

ఈ రోజు మొదలుకొని సుదర్శనుడికి రోజూ ఆమెమీద అకారణంగా కోపం వస్తూనేవుంది ఆమె సంసారం పొదుపుగా చేయడం లేదనో, తన సుఖదుఃఖాలలో పాల్గొనడం లేదనో, తుదకు తన కిష్టమైన కూరవండలేదనో, తన కిష్టమైన చీర కట్టుకోలేదనో, మొదలగు అతి స్వల్పమైన వాటికి కూడ విసుగు కొనుట ప్రారంభించాడు. ఆమెతో మాట్లాడడమే తగ్గించాడు. అథవా యెప్పుడైనా మాట్లాడితే "నీవు నాకు సహాయ కారివిగాలేవు. నా యందు సానుభూతి చూపలేవు. ఇదే చదువుకున్న భార్య గనుకైతే, భర్తకు యెంతో చేదోడు వాదోడుగా వుంటుంది" అని తన మనోభావాన్ని వెల్లడించందే వుండలేక పోయేవాడు.

నెల రోజులైనవి. ఆ రోజు సాయంత్రం సుదర్శనుడు కోర్టునుంచి 3 గంటలకే యింటికి వచ్చాడు వచ్చిన కొంత సేపటికి సుగుణను పిలచి: "శ్రీనివాసరావుగారు మనిద్దరిని యివాళ సాయంత్రం ౫-30 గంటలకు వారింటికి టీ పార్టీకి పిలిచారు సిద్ధంగావుండు. ఇద్దరం వెళదాము" అన్నాడు.

భర్తయొక్క విముఖత్వము నెల రోజులు అనుభవించిన సుగుణకు, యీ ఆహ్వానము యెంతో మనశ్శాంతి నిచ్చింది. కాని మఱుక్షణమే ఆమె ముఖము విషాదపూరితమైనది.

ఆమె భర్తతో "శ్రీనివాసరావుగారి భార్య పుట్టింటికి వెళ్ళిందిగదా! అతనింట్లో ఆడవాళ్ళెవ్వరూ లేరు. అతను

వొంటరిగా వుంటున్నాడు, కనుక నేను వస్తే బాగుండదు. మీరు మాత్రం వెళ్ళండి" అన్నది.

అసలే కోపంగావున్న సుదర్శనుడికి ఈ మాట అగ్నిలో హవ్యము పోసినట్లైంది. తన కోపంలో ఆమెను అనరాని మాటలని వెళ్ళిపోయినాడు.

శ్రీనివాసరావు గొప్ప జ్యోతిష్కుడు. అతడు వీరింటి వద్దకు కాపరంవచ్చి మూడు నెలలైంది. జ్యోతిషం చెప్పి బాగా సంపాదించి, యీ కొత్తయిల్లు కట్టించుకున్నాడు. ఈ యింటికి వచ్చిన నెలరోజులకు, భార్య పుట్టింటికి పురిటికి వెళ్ళింది. నాలుగు రోజుల క్రిందట కొడుకు పుట్టినట్లు శ్రీనివాసరావుకు కబురొచ్చింది. అందుకనే సుదర్శనుడిని, సుగుణను టీ పార్టీకి పిలిచాడు.

శ్రీనివాసరావు యీ క్రొత్తయింటికి వచ్చినకొద్ది రోజులకు సుదర్శనుడికి, శ్రీనివాసరావుకు స్నేహం కలిగింది. సుదర్శనుడికి జ్యోతిషంలో నమ్మకంలేదు. కాని యితడు చాలాగొప్ప జ్యోతిష్కుడని విన్న తరువాత, అతనికి కూడ జాతకం చూపించుకోవాలని కోర్కెపుట్టింది. వీరిద్దరి మధ్య స్నేహం కలగడానికి కారణం కూడ అదే.

సుగుణకు తన భర్తయందు యీ మార్పు యెందుకు కలిగిందో అగమ్య గోచరంగావుంది. కారణ మడిగితే చెప్పడు. ఇంట్లో వున్నప్పుడు కూడ చాలా సేపు తలుపులు వేసుకొని గదిలో కూర్చుంటాడు.

గులాబీపూవుకంటె సుకుమారమైన సుగుణ మనస్సు యీ తుపాను నెట్లా యెదుర్కోగలదు. ఆమెకు నిద్రాహారాలు లేవు. మూడు నెలల కల్లా చిక్కి శల్యమైంది. క్రమంగా మంచమెక్కింది. ఎంతెంత గొప్పవైద్యులు కూడ ఆమె వ్యాధిని కుదర్చ లేక పోయినారు. "మనోవ్యాధికి మందు లేద"న్న సామెత సార్థకమైంది. తుదకు ఆమె యీ లోకమునే విడిచి పోయింది.

మఱునాడు సుదర్శనుడు తన జాతకమును సుగుణ జాతకమును చూచి శ్రీనివాసరావు వ్రాసిచ్చిన కాగితమును తీసి యీ విధముగా చదువుకున్నాడు:

నీది గొప్ప జాతకము, కాని నీ భార్య జాతకము అంత శ్రేష్ఠమైనది కాక పోవుటవలన, నీకు రావలసిన వున్నతి కొంత తగ్గుతుంది. అయినప్పటికి నీకేమీ లోటుండదు. సుఖంగా సంసారం గడపటానికి, నలుగురిని ఆదరించడానికి తగినంత ధనం వుంటుంది. లక్షాధికారివి కాక పోయినా, ధనవంతుడివి అవుతావు.

నీకు సంతానం ఆలశ్యంగా కలుగుతుంది.

నీభార్య నీ వ్యవహారములో అంతగా తోడ్పడ లేదు. విద్యావతి కాకపోవుటచే, ఆమె వుద్దేశ్యములు నీ వుద్దేశ్యములు యేకీభవించవు. ఆమె ప్రకృతి నీప్రకృతి వేరు.

ఈ విధంగా జ్యోతిష్కుడు చెప్పిన మాటలను సుదర్శనుడు పూర్తిగా నమ్మాడు. ఆమె చదువుకున్నది కాక పోవడమే దీనికి కారణ మనుకున్నాడు. తన పది సంవత్సరముల వైవాహిక జీవితపు అనుభవము వుండికూడ, యిదంతా అబద్ధమని తోసివేయడానికి మనోధైర్యం లేక పోయింది. తన మనోవైకల్యంచేత, లేని పోని భావాలు కల్పించుకొని, పండంటికాపరం పాడుచేసుకున్నట్లు యిప్పటికి కూడ అర్థం చేసుకోలేక పోయినాడు.

